క్లుప్తంగా

భానుమూర్తికి సువర్ణ కంఠాభరణం బహూకరణ



భానుమూర్తిను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రావులపాలెం: గ్రామ పురోహితుడు, వేద పండితుడు దేవరభట్ల భానుమూర్తికి సువర్ణ కంఠాభరణం బహూకరించి సత్కరించారు. స్థానిక అంకాలమ్మ మహాలక్ష్మి ఆలయం 27వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు భానుమూర్తిని ఘనంగా సత్కరించారు.

బాలాజీకి రూ.2.29 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి కార్తిక ఆదివారం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చారు. స్వామికి వివిధ సేవల ద్వారా రూ.2.29 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.1.74 లక్షల ఆదాయం వచ్చింది. స్వామి వారి నిత్యాన్నదానానికి భక్తులు రూ.54,796 విరాళంగా చెల్లించారు. 4,092 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. 3,071 మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ ఈఓ జి.శ్రీదేవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు భక్తులకు కల్పించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్షణముక్తేశ్వరునికి లక్షబిల్వార్చన

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం ముక్తికాంత సమేత క్షణముక్తేశ్వరాలయంలో ఆదివారం సామూహిక లక్షబిల్వార్చన పూజలు జరిపారు. ఆలయ వేదపండితులు, అర్చకులు చిట్టిబాబు ఆధ్వర్యంలో స్వామికి విశేషాభిషేకాలు పూజలు జరిపారు. హోమం జరిపారు. సాయంత్రం స్వామికి శాంతి కల్యాణం నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. జ్యోతిర్లింగార్చన చేశారు.

దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

మామిడికుదురు: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఆదివారం మామిడికుదురులో ఘనంగా నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన మండల మదర్‌థెరిసా దివ్యాంగుల సంక్షేమ సంఘం సమావేశంలో అధ్యక్షుడు జీఎల్‌వీ రమణ మాట్లాడుతూ దివ్యాంగులకు ఇస్తున్న పెన్షన్‌ను రూ.7 వేలకు పెంచాలన్నారు. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సబ్సిడీ రుణాలు అందించాలని, మామిడికుదురులో దివ్యాంగుల భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు కోరుకొండ నరసింహమూర్తి, గుర్రం శ్రీనివాస్, కేతా శ్రీనివాసరావు, కందిబోయిన బాబు, కొమ్ముల కోటేశ్వరరావు, కుడుపూడి సాయి, గుబ్బల ఏడుకొండలు పాల్గొన్నారు.

పంటకాలువలో పూడికతీత

ఆలమూరు: మండలంలోని కొత్తూరు-వెదురుమూడి రోడ్డులోని కొత్త కాలువలో పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏపీఎం ప్రసాద్ నేతృత్వంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఎస్.విష్ణు, సీహెచ్ ధనరాజు ఈ పనులు చేయించారు. స్థానిక చింతలూరు ఎస్సీ ఏరియా నుంచి సంధిపూడి వరకూ ఈ పనులు జరిగాయి. దీనివల్ల రబీ పంటకు సంబంధించి పూర్తిస్థాయిలో సాగునీరుకు ఇబ్బందులు తొలగిపోతాయని రైతులు భావిస్తున్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి భక్తుల నుంచి విరాళాలు అందినట్లు ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన గీసాల వీర్రాజు, విజయలత దంపతులు రూ.50 వేలు, పిట్టల వేమవరానికి చెందిన డి.మోహన్‌దుర్గాసాయి రూ.25 వేలు, జొన్నాడకు చెందిన కె.సూర్యనారాయణరెడ్డి-మౌనిక దంపతులు రూ.11,116, ఆత్రేయపురానికి చెందిన ఎం.సత్యనారాయణరాజు-సునీత దంపతులు రూ.10 వేలు, అంకంపాలేనికి చెందిన కె.రాఘవేంద్ర రూ.10 వేలు, విశాఖపట్నం జిల్లా పూడిమడకకు చెందిన ఎన్.శ్రీనివాసరావు-రమణమ్మ దంపతులు రూ.10,116, అనకాపల్లికి చెందిన ఆర్.శ్రీనివాసరావు-పద్మావతి దంపతులు రూ.10,507, గాజువాక మండలం దువ్వాడకు చెందిన జె.రామకృష్ణప్రసాద్-రజిత దంపతులు రూ.10,116 విరాళం అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ చైర్మన్ రమేష్‌రాజు చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

పురుగుమందు తాగి వ్యక్తి మృతి

ఆత్రేయపురం: మండలంలోని ఉచ్చిలి గ్రామానికి చెందిన ఎలికే యాదేశ్వరుడు (25) పురుగుమందు తాగి మృతి చెందినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. యాదేశ్వరుడు పూతరేకుల వ్యాపారం చేసుకుని జీవిస్తుంటాడు. ఈ మధ్య ఆర్థికంగా వ్యాపారంలో నష్టం రావడంతో ఈనెల ఒకటిన పురుగుమందు తాగాడు. దీంతో కొత్తపేట ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి ఉన్నత వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తండ్రి ఎలికే శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైతుల్లో తుపాను కలవరం

- హడావుడిగా మాసూళ్లు
- తీర గ్రామాల్లో అలర్ట్



మామిడికుదురులో హడావుడిగా మాసూళ్లు



గంగలకుర్రులో వరి మోపులను ఎగుమతి చేస్తున్న రైతులు, కూలీలు

మామిడికుదురు: మిచాంగ్ తుపాను రైతులను సర్వత్రా ఆందోళనకు గురి చేస్తోంది. దీని ప్రభావంతో వీస్తున్న ఈదురుగాలులు రైతులను కలవరపెడుతున్నాయి. ఆకాశంలో దట్టంగా అలుముకున్న మేఘాలు, తుపాను ప్రభావంతో పడుతున్న చినుకులు రైతులను తీవ్ర అగచాట్లకు గురి చేస్తున్నాయి. పనలపై ఉన్న పంటను కుప్పలు వేసుకోవడం, పంటను మాసూళ్లు చేసుకోవడం వంటి పనులను రైతులు యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. మండలంలో 2,410 ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ పంటను రైతులు సాగు చేశారు. ఇందులో 279 ఎకరాల్లో పంట కోత కోశారని ఏఓ బి.మృదుల ఆదివారం తెలిపారు. 320 టన్నులు ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. 60 ఎకరాల పంటను రాశులుగా పోశారని చెప్పారు. 15 శాతం పంట మాత్రమే ఒబ్బిడి అయింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో భారీ వర్షం పడిన పక్షంలో పంట మొత్తం నేలనంటే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు తుపాను హెచ్చరికల నేపథ్యంలో సముద్ర తీరంలోని కరవాక గ్రామానికి చెందిన మత్స్యకారులు రెండు రోజుల నుంచి సముద్రంలో వేటకు స్వస్తి చెప్పారు. గ్రామానికి చెందిన సుమారు 140 వేట బోట్లను తీరంలో లంగరు వేశారు. ఈ బోట్ల ద్వారా రోజుకు 700 నుంచి 800 మంది ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో గంగపుత్రులు ఇంటి వద్దే ఉన్నారు. తుపాను ప్రభావం ఎంత వరకు ఉంటుందో అన్న ఆందోళన మత్స్యకారుల్లో కనిపిస్తోంది. అధికారులు తీర గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు. తీర గ్రామాల ప్రజలను అవసరమైన పక్షంలో సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

తప్పిన పెను ప్రమాదం

రాజోలు: తుపాన్ ఈదురుగాలుల కారణంగా రాజోలులోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఆదివారం కొబ్బరి చెట్టు విరిగిపడిపోయింది. విద్యుత్ తీగలపై బలంగా పడడంతో 216 జాతీయ రహదారికి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం విరిగిపోయి రోడ్డుకు అడ్డంగా పడింది. ఎదురుగాలులు నేపథ్యంలో అప్పటికే విద్యుత్ నిలిపివేయడంతో పాటు రోడ్డుపై ఆ సమయంలో ఎలాంటి వాహనాలు ప్రయాణించకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ సిబ్బంది స్థానికుల సహకారంతో కొబ్బరి చెట్టును తొలగించి విద్యుత్‌లైన్లుకు మరమ్మతులు చేపట్టారు. తుపాన్ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు తెలిపారు.

రైతుల్లో కలవరం

అంబాజీపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అంబాజీపేట మండలంలో వరి పంటలు కోత దశకు చేరుకున్నాయి. ఈ దశలో భారీ వర్షాలు కురిస్తే తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. యంత్రాలు ద్వారి వరి చేలను కోయిస్తే పశువులకు ఎండుగడ్డి దొరకదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాలతో వరి నూర్పిడి చేస్తే ఎండు గడ్డి 80 శాతం పనికిరాకుండా పోతుందని వాపోతున్నారు. వాతావరణం అనుకూలంగా లేనందున వరి మోపులను సురక్షిత ప్రాంతానికి రైతులు తరలించుకుంటున్నారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి వరి కోతలను వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.



రాజోలులో కొబ్బరిచెట్టు పడి విరిగిపోయిన విద్యుత్ స్తంభం

ఈదురు గాలులు–విరిగిన విద్యుత్ స్తంభాలు

ఆలమూరు: తుపాను ప్రభావం వల్ల వీచిన ఈదురు గాలుల ప్రభావం వల్ల గ్రామంలోని జిల్లెళ్లపేటలో విద్యుత్ స్తంభాలు విరిగి పడగా కొబ్బరి చెట్లు విద్యుత్ తీగలపై పడిపోవడంతో విద్యుత్ వ్యవస్థ చిన్నాభిన్నమైంది. దీని వల్ల ఆదివారం ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్ సిబ్బంది, అధికారులు తీవ్రంగా శ్రమించి పడిపోయిన చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వాతావరణం మేఘావృతమై ఉండటంతో ముందస్తు జాగ్రత్త చర్యగా రైతులు తమ ధాన్యాన్ని పరదాలు వేసుకుని సంరక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి స్వాగతం పలుకుతున్న యూటీఎఫ్ కౌన్సిల్ సభ్యులు

రావులపాలెం: ఉపాధ్యాయుల సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎంకేఆర్ కన్వెన్షన్‌లో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా నూతన కౌన్సిల్ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి జ్యోతిబసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల గొప్పదనాన్ని వివరించారు. ఎంతటి వారైనా ఉపాధ్యాయుల దగ్గర విద్యాబుద్ధులు అభ్యసించిన తర్వాతే గొప్పవారు అవుతారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సీఎం జగన్ దగ్గరికి తీసుకెళ్తానన్నారు. అలాగే కోవిడ్ సమయంలో యూటీఎఫ్ సేవలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, పడాల లింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఆదుర్రులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఆర్వో రమణారెడ్డి

అంబాజీపేట: గ్రామాల్లో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా స్థానిక పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రమణారెడ్డి ఆదివారం పరిశీలించారు. అంబాజీపేట, మాచవరం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి బీఎల్వోల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు పూర్తి సమాచారం ఇవ్వాలని పేర్లు సవరణ, చేర్పులు, మార్పులు అన్ని దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ టి.మంగతాయారు, ఆర్‌ఐ ఎండీ ఇబ్రహీం, వీఆర్వో రమణ, బీఎల్వో ఉన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఆదివారం ఎన్నికల స్పెషల్ క్యాంపులు నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ, పేరు మార్పు, చేర్పులు, అడ్రసు మార్పు వంటి వాటితో చనిపోయిన వారి పేర్ల తొలగింపు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మంగతాయారు తెలిపారు.

ఆదుర్రులో..

మామిడికుదురు: మామిడికుదురు మండలంలోని ఆదుర్రులోని 1,2, లూటుకుర్రు గ్రామంలోని 7,8 పోలింగ్ కేంద్రాలను జెడ్పీ సీఈఓ, పి.గన్నవరం నియోజకవర్గ ఈఆర్వో ఎ.రమణారెడ్డి ఆదివారం పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల వద్ద విధుల నిర్వహణ, కొత్త ఓటర్ల నమోదు పక్రియ, మార్పులు, చేర్పులు, తొలగింపు తదితర అంశాలపై సిబ్బందితో మాట్లాడారు. ఆయా కేంద్రాల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఏకాదశ రుద్రులను దర్శించుకున్న భక్తులు



గంగలకుర్రులో ఏకాదశ రుద్రులను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

అంబాజీపేట: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన భక్తులు ఏకాదశ రుద్రులను ఆదివారం దర్శించుకున్నారు. కోనసీమలోని 11 ఈశ్వర ఆలయాల దర్శనం ఒకే రోజున నిర్వహిస్తే కాశీ క్షేత్రాన్ని సందర్శించిన పుణ్యఫలం దక్కుతుందని పండితులు చెబుతున్నారు. తాడేపల్లిగూడెం ఏపీఎస్‌ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో ఉప్పాకపాడుకు చెందిన 108 మంది భక్తులు అంబాజీపేట వచ్చారు. ఈ సందర్భంగా భక్తులు వ్యాఘ్రేశ్వరంలోని వ్యాఘ్రేశ్వరుడు, కె.పెదపూడిలోని మేనకేశ్వరుడు, పుల్లేటికుర్రులోని మన్మహాదేవరుద్రుడు, గంగలకుర్రు అగ్రహారంలోని వీరేశ్వర స్వామి, గంగలకుర్రులోని చెన్న మల్లేశ్వరస్వామి, పాలగుమ్మిలోని చెన్నమల్లేశ్వరుడు, మొసలపల్లిలోని మధుమాసాంత భోగేశ్వర స్వామి, ముక్కామలలోని రాఘవేశ్వర స్వామి, నేదునూరులోని చెన్నమల్లేశ్వరస్వామి, వక్కలంకలోని విశ్వేశ్వర స్వామి, ఇరుసుమండలోని ఆనంద రామేశ్వర స్వామి ఆలయాలను ఎంతో భక్తి శ్రద్ధలతో దర్శించుకొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



ఊబలంకలో దివ్యాంగుల వేడుకల్లో కేకు కట్ చేస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

రావులపాలెం: మండలంలోని ఊబలంకలో మదర్‌థెరిసా ఆశ్రమంలో ఆదివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ నల్లమిల్లి సూర్యనారాయణరెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి పిల్లలకు పంచారు. వక్తలు మాట్లాడుతూ దివ్యాంగుల్లో పిల్లలు శారీరకంగా ఎదుగుదల ఉన్నప్పటికీ మానసిక ఎదుగుదల లోపిస్తుంది కాబట్టి ఇటువంటి పిల్లలకు మన వంతు చేయూతనివ్వాలని సూచించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు బాలురెడ్డి పిల్లలకు పుస్తకాలు, పండ్లు పంచారు. కార్యక్రమంలో ట్రైనీలు దిడ్ల కిషోర్, ఆశ, సంస్థ కన్వీనర్ నడింపల్లి సుబ్బరాజు వర్మ, గ్రామ ఉప సర్పంచ్ కొవ్వూరి దుర్గారెడ్డి, మాజీ ఎంపీటీసీ మాజీ మల్లిడి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌లో విమెన్ అసోసియేషన్ ఫర్ జెండర్ ఈక్వాలిటీ (వెజ్)స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. వెజ్ కన్వీనర్ పోతుముడి శేషారత్నం మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులు ఉన్న కుటుంబాల్లో వారిని చుట్టుపక్కల వారు చిన్నచూపు చూడటం వల్ల మానసికంగా వారు కుంగిపోతున్నారన్నారు.

యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

రావులపాలెం: స్థానిక ఎంకేఆర్ కన్వెన్షన్ హాలులో జరిగిన యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పెంకే వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎంటీవీ సుబ్బారావు ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా బి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పి సురేంద్ర కుమార్, జి సీతాదేవి, కార్యదర్శులుగా జీవీ రమణ, వై.మురళీమోహన్, టి.దుర్గాప్రసాద్, రాయుడు శ్రీనివాస్, వైవీఎస్ఎన్ బాలాజీ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా గొల్లపల్లి రాజు ఎన్నికైనట్లు మండల శాఖ అధ్యక్షుడు పడాల లింగేశ్వరరెడ్డి తెలిపారు.

ఐక్యతకు ప్రతీక వనసమారాధనలు



ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని సత్కరిస్తున్న పడాల సంక్షేమ సంఘం పెద్దలు



మాచవరంలో శాలివాహన వనసమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



పోతవరం జరిగిన కార్తిక వన సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కుడుపూడి

రావులపాలెం: కార్తిక మాసంలో జరిగే వన సమారాధనలు ఆత్మీయతకు దోహదం చేస్తాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆదివారం రావులపాలెంలోని విజయ్ విజన్ వద్ద పడాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పడాల వారి కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘీయులందరూ కలుసుకొని ఐక్యతకు ప్రతీకగా వన సమారాధనలు దోహదపడతాయని అన్నారు. సంఘ పెద్దలు పడాల పరమేశ్వరరెడ్డి, పడాల వీర్రెడ్డి, సత్తి సూర్యభాస్కర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సుభాకరరెడ్డిలు ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, డ్యాన్సులు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు సంఘ పెద్దలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోతవరంలో..

పి.గన్నవరం: కార్తిక వన సమారాధనలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. పోతవరం గ్రామంలోని సూర్య గార్డెన్స్‌లో గుత్తుల ధర్మ, నాగేంద్ర సోదరుల ఆధ్వర్యంలో ఆదివారం భారీ ఎత్తున కార్తిక వనసమారాధన కార్యక్రమం జరిగింది. ధర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ కుడుపూడి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సీఎం జగన్ రాష్ట్రంలో అమలు చేయనున్న కులగణనతో అన్ని కులాలకు, సంచార జాతులకు న్యాయం జరుగుతుందన్నారు. శెట్టిబలిజలు అంతా ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కుడుపూడి అన్నారు. నాయకులు దొమ్మేటి వెంకటశివరామ్, యాండ్ర నాగేశ్వరరావు, కుడుపూడి త్రినాథరావు, కంకటాల ఈశ్వరరావు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, యాండ్ర శ్రీను, చీకట్ల మీరా సాహెబ్, రామచంద్రరావు, మల్లిబాబు, గుత్తుల పండు, దొమ్మేటి రామారావు, పితాని రామకృష్ణ పాల్గొన్నారు.

మాచవరంలో..

అంబాజీపేట: కార్తిక వనసమారధనలు ఐక్యతకు ప్రతీకగా నిలవడమే కాకుండా మానవ సంబంధాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, సమాచార హక్కు చట్టం కమిషనర్ ఐలాపురం రాజా అన్నారు. మాచవరంలో కోనసీమ శాలివాహన సంఘం భవనం నందు ఆదివారం కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కుమ్మర శాలివాహన సంఘ అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ కుమ్మర శాలివాహనులు ఐక్యంగా ఉండి సంఘాభివృద్ధికి కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి మాట్లాడుతూ శాలివాహన కుమ్మర్లు తమ హక్కుల సాధన కోసం పోరాటం చేసి వాటిని కాపాడుకోవాలన్నారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి మానేపల్లి వీరబ్రహ్మం, పుల్లేటికుర్తి వెంకటేశ్వరరావు, ఆదుర్తి ఓం నమశ్శివాయ, సఖినేటిపల్లి పెద్దిరాజు, ఆదుర్తి శివరామకృష్ణలు బహుమతులు అందజేశారు. అంతకుముందు ఉసిరి చెట్టుకు, కార్తిక దామోదర స్వామికి, సత్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కోనసీమ కుమ్మర శాలివాహన సంఘ గౌరవ అధ్యక్షుడు వెల్లా పాండురంగారావు, దళపతి భీమేశ్వరరావు, ఆదుర్తి నారాయణమూర్తి, చిరతపూడి హేమలత, మంతెన శ్రీనివాస్, ర్యాలి శ్రీనివాస్ వడయార్ తదితరులు పాల్గొన్నారు.

పినపళ్లలో..

ఆలమూరు: మండలంలోని పినపళ్లలో ఆదివారం కార్తిక వనసమారాధన జరిగింది. స్థానిక గంగాలమ్మ ఆలయం వద్ద స్థానిక భక్తులు విరాళాలు సేకరించి ఈ అన్నదానాన్ని చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నసమారాధనలో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక, భజన కార్యక్రమాలు అలరించాయి.

బ్రాహ్మణ కార్తిక వన సమారాధన

రావులపాలెం: మండలంలోని దేవరపల్లిలో ఆదివారం బ్రాహ్మణ కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రిటైర్డ్ తహసీల్దార్ అజ్జరపు వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఉసిరిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు, కార్తిక దామోదర పూజ, పార్థివ లింగార్చన తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అందరూ వన భోజనాలు చేశారు.

శెట్టిబలిజ వన సమారాధన

కొత్తపేట: మండల శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యాన స్థానిక ఆర్‌ఎస్ బీసీ కన్వెన్షన్ హాలు ఆవరణలో ఆదివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి దంపతులు ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని 10 గ్రామాల నుంచి శెట్టిబలిజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలకు రూ.1.37 కోట్లు మంజూరు



గెద్దాడలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: గెద్దాడ గ్రామంలో తాగునీటి అవసరాలకు రూ.1.37 కోట్ల నిధులు మంజూరు చేశామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు తెలిపారు. జల్‌జీవన్ మిషన్ నిధులతో చేపట్టనున్న ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే రాపాక ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరి ఇంటి వద్ద తాగునీటి కుళాయి ఏర్పాటు చేసి దాని ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. ఏ ఒక్కరి నుంచి తాగునీరు అందడం లేదన్న మాట వినిపించకూడదని చెప్పారు. ప్రభుత్వం కూడా అదే విధంగా ఆలోచన చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, సర్పంచ్ గుబ్బల గీతాభవాని, ఎంపీటీసీ జవ్వాది పద్మావతి, పార్టీ నేతలు గూటం వెంకటేష్, ఇంజేటి వెంకటరమణ, గుబ్బల కాశీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పొదలాడలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: పుత్రవియోగంతో బాధపడుతున్న పొదలాడ గ్రామశాఖ అధ్యక్షుడు లిఖితపూడి బుజ్జిని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆదివారం పరామర్శించి ఓదార్చారు. ఇటీవల బుజ్జి కుమారుడు లిఖిపూడి తేజ (18) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తేజ చిత్రపటానికి ఎమ్మెల్యే రాపాక పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ గెడ్డం సురేష్, కంబాల చంద్రరావు, డాక్టర్ జాన్‌బాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రామకృష్ణ

మామిడికుదురు: కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడిగా లూటుకుర్రుకు చెందిన అప్పన శ్రీరామకృష్ణను నియమించారు. దీనికి సంబంధించి పార్టీ నుంచి ఆదేశాలు వచ్చాయని ఆదివారం శ్రీరామకృష్ణ తెలిపారు. ఆయన గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా పని చేశారు. తన నియామకానికి ఎంతో మంది పార్టీ నేతలు సహకారం అందించారని వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

కొత్తపేట: నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, అంబాజీపేట, పి.గన్నవరం, అయినవిల్లి మండలాలకు సంబంధించి డివిజన్ కేంద్రమైన కొత్తపేటలో 3 సెంటర్లు, వాడపాలెంలో 1 సెంటర్‌లో ఈ పరీక్ష నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సెంటర్లో 189 మంది విద్యార్థులకు 181 మంది హాజరయ్యారు. కాంతిభారతి జూనియర్ కళాశాలలో 192 మందికి 188 మంది, భాష్యం హైస్కూల్లో 245 మందికి 235 మంది, వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 240 మందికి 239 మంది విద్యార్థులు హాజరయ్యారు.

బీజేపీ విజయంపై శ్రేణుల హర్షం

సఖినేటిపల్లి/కొత్తపేట: మూడు రాష్ట్రాల్లో ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో బీజేపీ విజయకేతనం ఎగురవేయడంపై ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో బీజేపీ విజయంపై ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందరావు హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో కేంద్రంలో మూడోసారి ప్రధానిగా మోదీ సారథ్యంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం తథ్యమన్నారు. తెలంగాణలో బీజేపీ ఓటు శాతాన్ని పెంచుకుని ప్రజలకు మరింత చేరువైందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ గెలుపుపై హర్షం

అంబాజీపేట/మామిడికుదురు: తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంపై అంబాజీపేట, మామిడికుదురు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్‌లో, మామిడికుదురు బస్టాండ్ కూడలిలో ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో స్వీట్లు పంచి, బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.